546) నారాయణి

ప॥ తుడుచుకొంటే బోదు తొడరి నీవెంతైనా। వడియించీ మొక్కులనె వలపు నీమీద॥

చ॥ నిక్కి చూచి చెలి నీపైనిండా నవ్వులు నవ్వి। చిక్కని వెన్నెల తేట చిందీనదె।
చెక్కులను కొనగోళ్ళ జెనకి కాంతులమించ। లక్కరసములు చల్లీ లావుగా నీమీద॥

చ॥ వొరసి వొరసి నీతో వూరగల మాటలాడి। సిరుల గమ్మదేనెలు చిందీనదె।
సరిగా సేవలు సేసి చన్నుల మెఱుగులను। సరుగ బంగారుపొడి చల్లీ నీమీద॥

చ॥ బలిమి గాగిట బట్టి భావములనే కరగి। చెలగి వయోమదము చిందీనదె।
యెలమి శ్రీవేంకటేశ ఇంతి నిన్నిటా గూడి। చలముల గూరిములు చల్లీ నీమీద॥